క్లుప్తంగా

పెద్దిరెడ్డిని కలిసిన జెడ్పీ చైర్మన్



చిత్తూరు కార్పొరేషన్: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని సోమవారం తిరుపతిలోని ఆయన నివాసంలో జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాలోని పలు విషయాలపై చర్చించామని, ప్రస్తుతం ఉన్న ప్రజా సమస్యలు, ప్రభుత్వం హామీలు నెరవేర్చకుండా ప్రజలను దగా చేయడం, ప్రజల్లో వస్తున్న వ్యతిరేకత ఇత్యాది వాటి గురించి చర్చించినట్లు చెప్పారు. ఆయనతోపాటు శాంతిపురం జెడ్పీటీసీ శ్రీనివాసులు ఉన్నారు.

కంటి ఆపరేషన్లకు 40మంది ఎంపిక



రోగులను పరీక్షిస్తున్న సిబ్బంది

బంగారుపాళెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో సోమవారం మిషన్ ఫర్ విజన్ ట్రస్ట్, చెన్నై శంకర్ నేత్రాలయ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 65 మందికి వైద్య పరీక్షలు చేసి 40 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్టు నిర్వాహకుడు మురళీకృష్ణ తెలిపారు. వారిని చెన్నైకి తరలించి కంటి ఆపరేషన్లు చేసి, మందులు, కంటి అద్దాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

వినతులు త్వరగా పరిష్కరించాలి



వృద్ధురాలి సమస్య వింటున్న కమిషనర్

చిత్తూరు అర్బన్: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై ఎక్కడా కూడా నిర్లక్ష్యం చేయొద్దని, పీజీఆర్ఎస్ వినతులను త్వరగా పరిష్కరించాలని చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ నరసింహ ప్రసాద్ ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఇంజినీరింగ్, మెప్మా, రెవెన్యూ విభాగాలకు సంబంధించి పలు ఫిర్యాదులు అందాయి. వీటిని క్షేత్రస్థాయిలో విచారణ చేసి నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. సహాయ కమిషనర్ ప్రసాద్, మునిసిపల్ ఇంజినీర్ వెంకటరామిరెడ్డి, ప్రజారోగ్యశాఖ అధికారి డాక్టర్ లోకేష్, అసిస్టెంట్ సిటీ ప్లానర్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రామాపురంలో 104 సేవలు



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ అనూష

గుడిపాల: మండలంలోని 197రామాపురంలో 104 వాహనంలో వైద్యసేవలు అందించారు. బొమ్మసముద్రం వైద్యాధికారి అనూష బీపీ, షుగర్, మోకాళ్ల నొప్పులున్న వారికి చికిత్స చేసి మందులు, మాత్రలను ఉచితంగా అందజేశారు. అనంతరం మంచానపడ్డ రోగుల ఇళ్ల వద్దకే వెళ్లి పరీక్షించారు. వైద్యసిబ్బంది సరస్వతి, సుభాషిణి, దివ్య, అశ్విని, శశి పాల్గొన్నారు.

కొండాపురంలో వైద్య శిబిరం



గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

గుడిపాల: మండలంలోని కొండాపురంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామంలోని నవనీత(22) వైరల్ ఫీవర్‌తో పాటు పురుగు కాటు బారిన పడింది. తిరుపతి స్విమ్స్ ఆసుపత్రి చికిత్స పొందుతూ మృతి చెందింది. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎవరికైనా వైరల్ ఫీవర్ ఉందా? అని సర్వే చేశారు. అలాగే బొమ్మసముద్రం వైద్యాధికారి రష్మిత, అసిస్టెంట్ మలేరియా అధికారి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. పరిసరాలన్నింటినీ శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

20న నంద్యాలలో సమావేశం

పుంగనూరు: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టాలను నిరసిస్తూ ఈనెల 20న నంద్యాలలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎస్‌డీపీఐ నాయకులు తెలిపారు. దీనికి సంబంధించి సోమవారం పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ముస్లింలకు చెందిన ఆస్తులను కాపాడుకునేందుకు కులమతాలకతీతంగా నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు. నంద్యాల సమావేశానికి అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

గిట్టు.. డెయిరీలదే కనికట్టు



లీటరు పాలకు మద్దతు ధర రూ.50 చెల్లించాలని శాంతియుత ఉద్యమరైతు వెంకటాచలం నాయుడు కోరారు. సోమవారం కలెక్టరేట్ వద్ద చేతిన జెండా పట్టుకుని పాల ప్యాకెట్‌తో ఆయన వినూత్న నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ డెయిరీలు పాడి రైతులకు గిట్టుబాటు ధర చెల్లించడం లేదని విమర్శించారు. లీటరు పాలకు రూ.30 నుంచి రూ.40 వరకు మాత్రమే చెల్లిస్తున్నాయని, కానీ బయట మార్కెట్‌లో అర్ధ లీటరు పాల ప్యాకెట్ ధర మాత్రం రూ.38 వరకూ ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి సరైన గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. – చిత్తూరు కలెక్టరేట్

పింఛన్.. సదరన్!



సదరన్ సర్టిఫికెట్ ఉన్నప్పటికీ తనకు పింఛన్ ఇవ్వడం లేదయ్యా అని పెనుమూరు మండలం కనికాపురం కు చెందిన అర్జునయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తనకు 59 ఏళ్లని, షుగర్ వ్యాధి వల్ల ఎడమకాలును తొలగించారన్నారు. సదరన్ సర్టిఫికెట్‌లో 70 శాతం వికలత్వం ఉన్నట్లు ధ్రువీకరించినా తనకు ఇంత వరకు పింఛన్ ఇవ్వడం లేదని తన గోడు నివేదించారు. – చిత్తూరు కలెక్టరేట్

ఆర్టీసీలో కారుణ్యం చూపరూ!



ఏపీఎస్ ఆర్టీసీలో డ్రైవర్‌గా పనిచేస్తూ అనారోగ్యంతో తన తండ్రి గోపి 2010లో మృతి చెందారని రమ్య తన గోడు అధికారులకు నివేదించారు.తన తండ్రి మృతి చెందిన సమయంలో తాను మైనర్ కావడంతో ఉద్యోగం రాలేదన్నారు. తండ్రి మృతి చెందడంతో కుటుంబం అప్పుల్లో కూరుకుపోయిందన్నారు. తనకు కారుణ్య నియామకం కింద ఆర్టీసీలో ఉద్యోగం ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. – చిత్తూరు కలెక్టరేట్

ఎవరిని కదిపినా సమస్యలే..!

- కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక
- వినతులు స్వీకరించిన జాయింట్ కలెక్టర్ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : దయ చూపి..తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలని వివిధ ప్రాంతాల ప్రజలు విజ్ఞప్తి చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ, జాయింట్ కలెక్టర్ విద్యాధరికి సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు.



ప్రజా సమస్యలను వింటున్న జాయింట్ కలెక్టర్

దివ్యాంగ పింఛన్ మంజూరు చేయరూ!



దివ్యాంగ పింఛన్ మంజూరు చేయాలని గుడిపాల మండలం మరకాల కుప్పం గ్రామానికి చెందిన లత కోరారు. ఒకటిన్నర సంవత్సరం నుంచి తాను అనారోగ్యంతో బాధ పడుతున్నానని, దివ్యాంగ పింఛన్ కోసం అధికారులకు వినతులు ఇస్తున్నా పట్టించుకోవడం లేదని వాపోయారు. స్పందించి తనకు న్యాయం చేయాలని ఆమె కోరారు.

పొలం కబ్జా చేశారయ్యా!



తన పొలాన్ని దౌర్జన్యంగా ఆక్రమించారని సోమల మండలం నంజంపేటకు చెందిన చెంగల్‌రాయప్ప ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ, సర్వే నంబర్ 112/8 లో 0.37 సెంట్ల భూమి తనకు ఉందని, తన భార్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిందన్నారు. దీంతో ఐదు నెలలుగా పొలం వద్దకు వెళ్లలేదని చెప్పారు. ఆ సమయంలో మరొకరు దౌర్జన్యంగా తన పొలాన్ని ఆక్రమించి కూసాలు నాటేశారన్నారు. దిక్కున్న చోట చెప్పుకోమని బెదిరిస్తున్నారని చెప్పారు. అధికారులు స్పందించి తనకు న్యాయం చేయాలని కోరారు.

పాత బస్టాండ్ దుకాణదారుల కడుపు కొట్టొద్దు

చిత్తూరు కార్పొరేషన్ : చిత్తూరు పాత బస్టాండ్ దుకాణదారుల కడుపు కొట్టొద్దని సీపీఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. 50 ఏళ్ల క్రితం పట్టాలు పొంది చిన్నా చితకా వ్యాపారాలు చేసుకుంటున్న పాత బస్టాండ్ దుకాణదారులపై కూటమి ప్రభుత్వం ప్రతాపం చూపడం అన్యాయమన్నారు. నగరపాలక అధికారులు దుకాణదారులకు జారీచేసిన నోటీసులను వెంటనే వాపస్ తీసుకోవాలన్నారు. చిత్తూరు పాత బస్టాండ్‌కు సంబంధించిన స్థలాన్ని 1996లో మొత్తం 54 మంది రూ.8 లక్షలు ప్రభుత్వానికి చెల్లించి పట్టాలు పొందారన్నారు. అప్పట్లో వారికి 10కి 20 అడుగుల చొప్పున కొలతలలో దుకాణాలను ఏర్పాటు చేసుకునేలా వెసులుబాటు కల్పించారన్నారు. నాటి నుంచి వివిధ వ్యాపారాలు చేసుకుంటూ కుటుంబాలను పోషిస్తున్నారన్నారు. అయితే ఈ స్థలాల్లో మల్టీప్లెక్స్ షాపింగ్ కాంప్లెక్స్‌లు నిర్మిస్తామంటూ హఠాత్తుగా చిత్తూరు నగరపాలక సంస్థ అధికారులు ఆ దుకాణాలను ఖాళీ చేయించాలని రంగంలోకి దిగడం దుర్మార్గమని నిరసించారు. ఉన్న పళాన వారిని ఖాళీ చేయిస్తే వారు ఎలా బతకాలని ప్రశ్నించారు. సమస్యను పరిష్కరించేంత వరకు వ్యాపారుల తరపున రోజుకో రీతిలో స్థానిక గాంధీ విగ్రహం ఎదుట తమ పార్టీ ఆందోళన చేస్తుందని ఆయన ప్రకటించారు.

పౌష్టికాహారంతో రక్తహీనత దూరం



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: గర్భిణులు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకుంటే రక్తహీనత బారిన పడరని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని పాలకల రెడ్డివారిపల్లె, కుమ్మరపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారిరోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామాల్లో ఏర్పాటు చేసి ఉచిత వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ వైభోగమే..!



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న వేద పండితులు

వి.కోట: పట్టణంలో శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం సాయంత్రం కల్యాణోత్సవం భక్తజన సందడి నడుమ వేడుకగా నిర్వహించారు. స్వామి వారి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం ఆలయంలో ప్రత్యేకపూజలు అభిషేకాల అనంతరం మండల విశ్వ బ్రాహ్మణ సంఘం స్వామివారి కాశీయాత్ర కార్యక్రమాన్ని పుర వీధుల్లో నిర్వహించింది. కల్యాణోత్సవానికి సర్పంచ్ పీఎస్ లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు మేళతాళాలు, మంగళవాయిద్యాల హోరు నడుమ పట్టువస్త్రాలు తీసుకువచ్చి సమర్పించారు. అనంతరం రుత్వికులు శాస్త్రోక్తంగా కల్యాణోత్సవం నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు అధికసంఖ్యలో హాజరయ్యారు. నిర్వాహకులు ఆలయం వద్ద అన్నదానం చేశారు. రాత్రి స్వామి వారిని మండల బలిజ సంఘం ఆధ్వర్యంలో స్వామివారిని గరుడ వాహనంపై మంగళ వాయిద్యాలు, పండరి భజనలు, కోలాటాల నడుమ ఊరేగించారు. ఉభయదారులు భక్తులకు తీర్థ,ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విశ్వ బ్రాహ్మణులు, మండల బలిజ సంఘ నాయకులు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, ఆలయ ధర్మకర్త సీతారామయ్య, భక్తులు పాల్గొన్నారు.



విశ్వ బ్రాహ్మణులు నిర్వహిస్తున్న కాశీయాత్ర

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తవణంపల్లె: మండలంలోని తెల్లగుండ్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో అంగన్‌వాడీ వర్కర్(ఓసి రిజర్వేషన్), ద్వారకాపురం అంగన్‌వాడీ కేంద్రంలో హెల్పర్(సహాయకురాలు) పోస్టు (ఎస్సీ రిజర్వేషన్)లకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐరాల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ నిర్మల తెలిపారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈ నెల 22వ తేదీ లోపు ఐరాలలోని తమ కార్యాలయంలో సమర్పించాలని, పూర్తి వివరాలను కార్యాలయ పనివేళల్లో తనను సంప్రదించాలని కోరారు.

చిత్తూరు నియోజకవర్గంలో..

చిత్తూరు రూరల్ (కాణిపాకం): చిత్తూరు నియోజకవర్గంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చిత్తూరు సీడీపీఓ ఓ ప్రకటనలో తెలిపారు. చిత్తూరు రూరల్ మండలం తొప్పాతిపల్లె, రామభద్రాపురం, చిత్తూరులోని తోటపాళ్యం, గుడిపాలలోని రామభద్రాపురంలో ఖాళీగా ఉన్న సహాయకురాలి పోస్టులకు ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు చిత్తూరులోని ప్రభుత్వ ఐటీఐ పక్కనున్న తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.



పలమనేరు పట్టణ ఆవాస ప్రాంతం, రోడ్డు



మంచు దుప్పట్లో..!

పలమనేరు: నియోజకవర్గంలో సోమవారం ఉదయం పదిగంటలైనా మంచు వర్షంలా కురవడంతో సూరీడు ముఖం చాటేశాడు. దట్టంగా కురుస్తున్న మంచు మూలాన ముందున్న చెట్లు, దారులు కూడా కనిపించలేదు. మరోవైపు తీవ్రమైన చలికారణంగా జనం ఇళ్ల నుంచి బయటికి రాలేదు. పొద్దునే పాడిరైతులు పాలుపితకడం, పాలుపోయడం, ఇక సేద్యం పనులు మాత్రం మంచులోనే చేయడం కనిపించింది. హైవే, ఇతర రహదారుల్లో అయితే ముందు వెళ్లే వాహనాలు సైతం కనిపించక వాహనచోదకులు హెడ్‌లైట్లు వేసుకుని ప్రయాణించాల్సి వచ్చింది. సాధారణంగా జనవరి నెలాఖరుకల్లా మంచు ప్రభావం తగ్గడం పరిపాటి. అయితే ఫిబ్రవరి మొదలై పదిరోజులవుతున్నా ఇప్పటికీ మంచు దట్టంగా కురుస్తూ శీతాకాలాన్ని తలపిస్తోంది.



పదిగంటల తర్వాత కనిపిస్తున్న భానుడు

నులి పురుగుల రహిత సమాజానికి కృషి



ఐరాల: విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : నులిపురుగులు లేని సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ భారతి అన్నారు. సోమవారం స్థానిక పీసీఆర్ ప్రభుత్వ పాఠశాలలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె మాట్లాడారు. నులి పురుగుల వల్ల విద్యార్థులందరికీ అల్బెండజోల్ మాత్రలు అందేలా చూడాలన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ సుధారాణి మాట్లాడుతూ, పిల్లలు తప్పనిసరిగా వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. భోజనానికి ముందు, తర్వాత, మలవిసర్జన తర్వాత తప్పనిసరిగా చేతులు శుభ్రం చేసుకోవాలన్నారు. నులిపురుగుల నిర్మూలనకు అల్బెండజోల్ 400 ఎంజీ మాత్రను తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. అనంత రం విద్యార్థులకు మాత్రలను అందజేశారు. కార్యక్రమంలో మేయర్ అముద, కమిషనర్ నరసింహప్రసాద్, ఆర్‌బీఎస్‌కే కో–ఆర్డినేటర్ డాక్టర్ శిరీష, డిప్యూటీ మేయర్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఐరాల మండలంలో..

ఐరాల: నులి పురుగుల నిర్మూలనతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పాఠశాలలు, కాలేజీ, అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. అలాగే కాణిపాకం పీహెచ్‌సీ పరిధిలోని పాఠశాలలో డాక్టర్లు స్వాతి సింధూర, రాజేశ్వరి విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గుడిపాలలో..

గుడిపాల: మండంలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్, సీఎస్ఆర్ కళాశాలలో సోమవారం 800 మంది విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలను వేశారు. గుడిపాల పీహెచ్‌సీ వైద్యాధికారులు సంధ్య, చంద్రమహేష్ మాట్లాడారు.1–19 ఏళ్లలోపు వారికి విధిగా ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఖాతుంబి, కరస్పాండెంట్ లోకేష్, ఏఎస్ఎం జబసెల్వి, హెల్త్ సూపర్‌వైజర్ విజయ, సిబ్బంది చంద్రశేఖర్, అనిత, రోస్లిన్ పాల్గొన్నారు.

బాలల ఆరోగ్యం.. దేశానికి సౌభాగ్యం

తవణంపల్లె: బాలల ఆరోగ్యం దేశానికి సౌభాగ్యమని తవణంపల్లె వైద్యాధికారి డాక్టర్ ప్రియాంక అన్నారు. జాతీయ నులి పురుగుల నిర్మూలన దినం పురస్కరించుకుని మండలంలో 1–19 ఏళ్లలోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలను మింగించారు. అరగొండ బాలుర హైస్కూల్లో వైద్యాధికారి డాక్టర్ ప్రియాంకతో కలసి తహసీల్దార్ సుధాకర్, అరగొండ పాఠశాలలో ఎంపీడీఓ రెడ్డిబాబు, తవణంపల్లె ప్రాథమిక పాఠశాలలో ఎంఈఓ హేమలత, తవణంపల్లె హైస్కూల్లో వైద్యాధికారి డాక్టర్ మోహన్ వేలు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. డాక్టర్ ప్రియాంక మాట్లాడారు. ఆల్బెండజోల్ మాత్ర పిల్లల్లో రక్తహీనత నియంత్రిస్తుందన్నారు..మండలంలో 8398 మంది పిల్లలు ఉండగా 8099 మందికి ఈ మాత్రలు వేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంఈఓ త్యాగరాజులు రెడ్డి, వైద్యాధికారులు కేశవనారాయణ, వినయ్‌కుమార్, సీహెచ్‌ఓలు రాజామణి, సుబ్రమణ్యం, హెల్త్ సూపర్‌వైజర్ రాజశేఖర్, ఆరోగ్య కార్యకర్తలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎస్ఎంలు, ఉపాధ్యాయులు,అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



తవణంపల్లె ప్రాథమిక పాఠశాలలో..









చిత్తూరు కలెక్టరేట్: విద్యార్థులకు మాత్రలను మింగిస్తున్న భారతి, గుడిపాల మండలంలో.., అరగొండ బాలుర హైస్కూల్లో, అరగొండ ప్రాథమిక పాఠశాలలో..

రెవెన్యూ సమస్యలే ఎక్కువ



ఆర్డీఓ కార్యాలయం వద్ద అర్జీదారులు

పలమనేరు: పలమనేరు ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో 20 వరకూ వినతులు అందాయి. వీటిలో ఎక్కువగా రెవెన్యూ సంబంధిత సమస్యలే వచ్చాయి. వీటిని ఆయా తహసీల్దార్ కార్యాలయాలకు పంపి త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీఓ భవాని ఆదేశించారు. కొన్ని సమస్యలపై అక్కడే అందుబాటులో ఉన్న అధికారులతో ఆమె మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.

అగ్ని ప్రమాదం

పుంగనూరు: మండలంలోని బత్తలాపురం గ్రామ సమీపంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపిన వివరాలు..గ్రామానికి చెందిన కృష్ణప్ప నీలగిరి తోటలో మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది అక్కడికి వెళ్లి మంటలను ఆర్పివేశారు. ఎండలు మొదలవుతున్న తరుణంలో ప్రతి ఒక్కరూ అగ్నిప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఎండిన ఆకులు, రోడ్డు పక్కన ఉన్న చెత్తపై బీడీలు, సిగిరెట్లు తాగి పారవేయరాదని, వీటివల్ల అగ్ని ప్రమాదాలకు తావిచ్చినట్లవుతుందన్నారు.